www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 25 జూన్ 2025

5

ఏలూరు

నేడు అంబేద్కర్ గురుకులాల్లో ప్రవేశానికి పరీక్ష

ప్రజాశక్తి - ఏలూరు

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకులాల్లో ప్రస్తుత విద్యా సంవత్సరానికి 6, 7, 8, 9 తరగతుల్లో మిగిలిన సీట్లకు అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 25న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల విద్యాసంస్థ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కోఆర్డినేటర్ బి.ఉమాకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25వ తేదీ ఉదయం పది గంటల నుంచి 11 గంటల వరకూ 6, 7 తరగతులకు, మధ్యాహ్నం రెండు గంటల నుంచి మూడు గంటల వరకూ 8, 9 తరగతులకు పరీక్ష నిర్వహిస్తారని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. బాలికలకు ఏలూరు శివారు వట్లూరులోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకులంలోనూ, బాలురకు పెదవేగిలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకులంలోనూ పరీక్ష నిర్వహిస్తారని పేర్కొన్నారు.

కౌలు కార్డుల లక్ష్యం చేరేదెప్పుడో..!

పశ్చిమలో లక్షా ఐదు వేలు, ఏలూరు జిల్లాలో 75 వేలు టార్గెట్

రెండు జిల్లాల్లో 25 శాతం కూడా పూర్తికాని లక్ష్యం

కౌలు రైతులకు బ్యాంకు రుణాలు, అన్నదాత సుఖీభవ అందేనా?

వర్షాలతో ముమ్మరంగా ఖరీఫ్ సాగు పనులు

దాదాపు తొమ్మిది వేల ఎకరాల్లో నారుమడులు పూర్తి

మెట్ట ప్రాంతంలో ప్రారంభమైన నాట్లు

ఉంగుటూరు మండలం మెట్ట ప్రాంతంలో నాట్లు నాటిన పొలాలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఖరీఫ్ సాగు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పటికే మెట్ట ప్రాంతంలో నాట్లు ప్రారంభమవ్వగా, డెల్టాలోనూ మరో వారం, పది రోజుల్లో నాట్లు మొదలుకానున్నాయి. అయినప్పటికీ కౌలుకార్డుల జారీ ప్రక్రియ వేగంగా సాగని పరిస్థితి నెలకొంది. రాష్ట్రవ్యాప్తంగా పరిశీలిస్తే కౌలుకార్డుల జారీ ప్రక్రియలో ఏలూరు జిల్లా మూడు, పశ్చిమ నాలుగో స్థానంలో ఉన్నప్పటికీ తీసుకున్న కౌలుకార్డుల లక్ష్యంలో మాత్రం 25 శాతం కూడా పూర్తికాని పరిస్థితి ఉంది. దీంతో కౌలుకార్డుల జారీ ప్రక్రియ ఎప్పటికి పూర్తవుతుందోనని చర్చ రైతుల్లో సాగుతోంది. ఖరీఫ్‌లో ఏలూరు జిల్లావ్యాప్తంగా 2.50 లక్షల ఎకరాల్లో, పశ్చిమలో 2.15 లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేపడుతున్నారు. గడిచిన నాలుగైదు రోజులుగా వర్షాలు పడుతుండడంతో రెండు జిల్లాల్లోనూ ఖరీఫ్ పనులు ముమ్మరంగా ప్రారంభమయ్యాయి. ఏలూరు జిల్లాలో 11 వేల ఎకరాల్లో నారుమడులు వేయాల్సి ఉండగా ఇప్పటి వరకూ 4,500 ఎకరాల్లో పూర్తయ్యాయి. పశ్చిమలో పది వేల ఎకరాల్లో నారుమడులు వేయాల్సి ఉండగా 3,500 ఎకరాల్లో రైతులు నారుమడులు వేసిన పరిస్థితి ఉంది. తాడేపల్లిగూడెం, ఉంగుటూరు, భీమడోలు వంటి పలు మెట్ట మండలాల్లో బోర్ల కింద వరినాట్లు సైతం ప్రారంభమయ్యాయి. మరో వారం, పది రోజుల్లో డెల్టాలోనూ రైతులు ముమ్మరంగా వరినాట్లు నాటనున్నారు. రెండు జిల్లాల వ్యవసాయ సాగులో 75 శాతం కౌలురైతులే చేస్తున్నారు. నిబంధనల ప్రకారం ఖరీఫ్ సాగు ప్రారంభ సమయానికి బ్యాంకులు పంటరుణాలు అందించాల్సి ఉంది. అప్పుడే రైతులు పెట్టుబడుల కోసం ఎటువంటి ఇబ్బందులూ పడకుండా ఉంటారు. ఖరీఫ్ సాగు ముమ్మరంగా సాగుతున్నప్పటికీ కౌలుకార్డుల జారీ ప్రక్రియ మందకొడిగా సాగుతోంది.

లక్ష్యం పూర్తయ్యేదెప్పుడు.. కౌలు రైతులకు మేలు జరిగేదెప్పుడు..!

2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం కౌలుకార్డుల జారీ ప్రక్రియ ప్రారంభించి రోజులు గడిచిపోతుంది. పశ్చిమగోదావరి జిల్లాలో లక్షా ఐదు వేలు, ఏలూరు జిల్లాలో 75 వేల కౌలుకార్డులు జారీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటి వరకూ ఏలూరు జిల్లాలో 19 వేలు, పశ్చిమలో 13 వేల వరకూ కౌలుకార్డుల జారీ ప్రక్రియ పూర్తయ్యింది. తీసుకున్న టార్గెట్‌లో 25 శాతం కూడా కార్డుల జారీ కాని పరిస్థితి ఉంది. పూర్తిస్థాయిలో కౌలుకార్డుల జారీ ఎప్పటికి పూర్తవుతుందోనని అనుమానాలు నెలకొన్నాయి. కౌలుకార్డులు ఇస్తే తప్ప బ్యాంకులు పంటరుణాలు ఇవ్వవు. ఈ పరిస్థితుల్లో కౌలురైతులు ఏవిధంగా సాగు సాగించాలో ప్రశ్నార్థకమే చెప్పాలి. గత వైసిపి ప్రభుత్వంలో కౌలుకార్డుల జారీలోనూ, పంట రుణాల మంజూరులోనూ కౌలురైతులకు తీవ్ర అన్యాయం జరిగింది. కూటమి ప్రభుత్వం వచ్చాక మేలు జరుగుతుందని భావించిన గతేడాది వైసిపి బాటలోనే కూటమి పాలకులు నడిచారు. ఈ ఏడాదైనా కౌలురైతులకు న్యాయం జరుగుతుందని అన్నదాత ఆశలు పెట్టుకున్నారు. కౌలుకార్డుల జారీ ప్రక్రియ చూస్తే కౌలురైతులకు మళ్లీ మొండిచెయ్యేనా అనే అనుమానాలు నెలకొన్నాయి. కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ కింద కౌలురైతులకు సైతం ఏడాదికి రూ.20 వేలు అందిస్తామని చెప్పింది. ఈ నెలలోనే అన్నదాత సుఖీభవ పథకం నిధులు జమ చేస్తామని ప్రభుత్వం చెబుతోంది. కౌలుకార్డుల జారీ ప్రక్రియ పూర్తి కాకపోతే కౌలురైతులకు అన్నదాత సుఖీభవ సొమ్ము అందడం సాధ్యం కాదు. బ్యాంకులు పంటరుణాలు సైతం ఇచ్చే పరిస్థితి ఉండదు. ప్రభుత్వం త్వరితగతిన కౌలుకార్డుల జారీచేసి బ్యాంకుల్లో పంటరుణాలు, అన్నదాత సుఖీభవ సొమ్ము అందేలా చేయాలని కౌలురైతులు కోరుతున్నారు.

వార్షిక రుణ ప్రణాళిక విడుదల చేస్తున్న కలెక్టర్, బ్యాంకు అధికారులు

వ్యవసాయానికి రూ.13,845 కోట్లు

రూ.21,262 కోట్లతో వార్షిక రుణ ప్రణాళిక విడుదల చేసిన కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.21,262 కోట్లతో వార్షిక రుణ ప్రణాళికను కలెక్టర్ కె.వెట్రిసెల్వి విడుదల చేశారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి బ్యాంకర్ల సమావేశంలో ఆమె రుణ ప్రణాళికను విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గతంకన్నా రూ.3 వేల కోట్లు అదనంగా వార్షిక రుణ ప్రణాళిక రూపొందించారన్నారు. దీనిలో రూ.13,845 కోట్లతో వ్యవసాయానికి ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలిపారు. ప్రాధాన్యతారంగాలకు రూ.18,243 కోట్లు, ప్రాధాన్యేతర రంగాలకు రూ.3,018 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. వ్యవసాయ స్వల్పకాలిక రుణాల కింద రూ.8,396 కోట్లు, వ్యవసాయ టరమ్ లోన్స్ కింద రూ.4,338 కోట్లు, వ్యవసాయ మౌలిక సదుపాయాలకు రూ.1,111 కోట్లు, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు రూ.3,343 కోట్లు, ఇతర ప్రాధాన్యతారంగాలకు రూ.1,055 కోట్లు వార్షిక రుణ ప్రణాళికలో పొందుపర్చారన్నారు. గతేడాది వార్షిక రుణ ప్రణాళికలో రూ.18,256 కోట్లకుగాను రూ.21,816 కోట్లతో 119 శాతం లక్ష్యాన్ని సాధించారన్నారు. ఆయా రంగాలకు నిర్దేశించిన రుణాలను నూరుశాతం లక్ష్యాలు సాధించే దిశగా బ్యాంకర్లు కృషి చేయాలన్నారు.

కౌలు రైతులకు రుణాల మంజూరులో ప్రాధాన్యతివ్వాలి

కౌలు రైతులకు, ఉద్యాన పంటలకు, పాడి రైతులకు రుణాల మంజూరులో అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి బ్యాంకర్లను ఆదేశించారు. వ్యవసాయ రుణాలు, పిఎం సూర్యఘర్, ఎస్‌హెచ్‌జి బ్యాంకు లింకేజీ, పిఎం స్వానిధి, పిఎం విశ్వకర్మ తదితర పథకాల పురోగతిపై ఆమె సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ భూమిపై సాగుచేస్తూ సిసిఆర్‌సి కార్డు గల కౌలు రైతులకు విరివిగా రుణాలు ఇవ్వాలన్నారు. ఇదే సమయంలో ఉద్యాన, పాడి రైతులకు అవసరమైన రుణాల మంజూరుకు ప్రాధానతివ్వాలన్నారు. కోకో, ఆయిల్‌పామ్‌కు సంబంధించి పోస్ట్ హార్వెస్టింగ్, ప్లాట్‌ఫామ్ నిర్మాణాలు తదితరాలకు సంబంధించి సబ్సిడీపై రుణాలు అందించడంలో బ్యాంకర్లు ముఖ్యపాత్ర పోషించాలన్నారు. చిన్న, మధ్యతరహా ఫుడ్ ప్రొసెసింగ్ యూనిట్లు వంద నెలకొల్పే లక్ష్యంగా డిఆర్‌డిఎ, మెప్మా బ్యాంకర్లతో సమన్వయంతో పని చేసి యూనిట్లు త్వరితగతిన స్థాపనకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో మినీ రైస్‌మిల్లుల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, ఇప్పటికే 50 యూనిట్ల స్థాపనకు అందిన దరఖాస్తులపై చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. పోలవరం నిర్వాసితులు నివశిస్తున్న కొత్త కాలనీల్లో జీలుగుమిల్లి, బుట్టాయిగూడెం తదితర ప్రాంతాల్లో కొత్త బ్యాంకు బ్రాంచిలు ప్రతిపాదించాలని బ్యాంకర్లను ఆదేశించారు. సమావేశంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ హెడ్ ఎన్.శ్రీనివాసరావు, ఆర్‌బిఐ ఎజిఎం అభిషేక్‌రాజ్, ఎల్‌డిఎం డి.నీలాద్రి, నాబార్డు డిడిఎం పి.అనిల్‌కాంత్, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి ఎం.ముక్కంటి, జెడ్‌పి సిఇఒ శ్రీహరి, జిల్లా ఉద్యాన శాఖాధికారి ఎస్.రామ్మోహన్, జిల్లా వ్యవసాయాధికారి ఎం.హబీబ్‌భాషా, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ఎన్ఎస్.కృపావరం, బిసి కార్పొరేషన్ ఇడి ఎన్.పుష్పలత, వివిధ శాఖల జిల్లా అధికారులు, వివిధ బ్యాంకుల జిల్లా కో ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

బదిలీలు పారదర్శకంగా చేపట్టాలి

సచివాలయ ఉద్యోగుల ఆందోళన



నూజివీడులో ఆందోళన

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

తమ సమస్యలు తక్షణమే పరిష్కరించాలని, బదిలీలు పారదర్శకంగా చేపట్టాలని డిమాండ్ చేస్తూ సచివాలయ సిబ్బంది స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగ నేత ప్రవీణ్ మాట్లాడుతూ తమకు సొంత మండలానికి బదిలీకి అవకాశం కల్పించాలన్నారు. రేషనలైజేషన్‌లో ఒకే గ్రామం యూనిట్‌గా కొనసాగించాలన్నారు. డిఎ, ఐఆర్, ప్రమోషన్ ఛానల్ సీనియారిటీ ప్రకారం సాగించాలన్నారు. అనంతరం సబ్ కలెక్టర్ బచ్చు స్మరణరాజ్‌కు వినతిపత్రం అందించారు. దీనిపై స్పందించిన సబ్ కలెక్టర్ మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది సమస్యల వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్‌కు పంపనున్నట్లు తెలిపారు.

ఉంగుటూరు: తాము సొంత మండలంలో పని చేసే అవకాశం కల్పించాలని, బదిలీలు పారదర్శకంగా చేపట్టాలని కోరుతూ మండలంలోని సచివాలయ ఉద్యోగులు మంగళవారం మండల అధికారులను కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగి సూరత్తుల మల్లేశ్వరరావు మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ప్రారంభమై ఐదేళ్లు పూర్తవుతున్న తరుణంలో సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులను సొంత మండలాలకే బదిలీ చేయాలని కోరారు. బదిలీల ప్రక్రియ ఆన్‌లైన్‌లో పారదర్శకంగా నిర్వహించాలని కోరారు. ఎంపిడిఒ గంజి రాజ్‌మనోజ్‌కు వినతిపత్రం అందజేశారు.



ఉంగుటూరులో వినతి అందజేత

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు తెలిపారు. మంగళవారం బర్రింకలపాడు క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి సమస్యలతో కూడిన వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రజా సమస్యలు ఏమైనా ఉంటే మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



వినతులు స్వీకరిస్తున్న ఎంఎల్‌ఎ బాలరాజు

ఓట్ల కోసమే సత్యసాయిబాబా జయంతి నిర్వహణ

ఎపి హేతువాద సంఘం జిల్లా అధ్యక్షులు కడలి రామాంజనేయులు

ప్రజాశక్తి - ఏలూరు

పుట్టపర్తి సత్యసాయిబాబా జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారిక కార్యక్రమంగా నిర్వహించాలనుకోవడం ఓటుబ్యాంకు రాజకీయాల్లో భాగమని ఎపి హేతువాద సంఘం జిల్లా అధ్యక్షులు కడలి రామాంజనేయులు అన్నారు. మంగళవారం స్థానిక ఆర్‌ఆర్‌పేట స్ఫూర్తి భవనంలో హేతువాద సంఘం నాయకులు కోడూరి సత్యనారాయణ అధ్యక్షతన జిల్లా సమావేశం మంగళవారం జరిగింది. సంఘం జిల్లా అధ్యక్షులు కె.రామాంజనేయులు మాట్లాడుతూ అభ్యుదయవాదులు, సంఘ సంస్కర్తలు, కవుల జయంతులు, వర్ధంతులను విస్మరించిన ప్రభుత్వం, పుట్టపర్తి సత్యసాయిబాబా జయంతిని రాష్ట్ర కార్యక్రమంగా జరపాలనుకోవడం ఓటుబ్యాంకు రాజకీయాల్లో భాగమని విమర్శించారు. సైంటిఫిక్ టెంపర్‌ను ప్రోత్సహించాల్సిన ప్రభుత్వం మహిమల పేరుతో ప్రసిద్ధుడైన సత్యసాయిబాబా జయంతిని అధికారికంగా జరపాలనుకోవడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వాలు బాబా పట్ల చూపిన గౌరవం, మహాకవి శ్రీశ్రీ, గురజాడ అప్పారావు, కందుకూరి వీరేశలింగం, గుర్రం జాషువాల పట్ల చూపకపోవడం విచారకరమన్నారు. ఇప్పటికైనా భావితరాల భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుని శాస్త్రీయ ఆలోచన పట్ల అవగాహన కల్పించి, మూఢ నమ్మకాల వ్యతిరేక చట్టాన్ని తీసుకురావాల్సిన అవసరం ఉందని అన్నారు. సమావేశంలో ముందుగా ఇటీవల మరణించిన హేతువాది, నటుడు అల్లం గోపాలరావు, అవయవదాన ఉద్యమ నాయకురాలు పేరేచర్ల లక్ష్మీకాంతానికి నివాళులర్పించారు. సమావేశంలో నేతలు బండి వెంకటేశ్వరరావు, వాకాడ రాజారావు, ముత్యాల సాంబశివరావు, రవికుమార్ మాట్లాడగా, కాకర్ల రాజేంద్రప్రసాద్, ఎస్.గిరి, డి.శ్రీనివాస్, ప్రసాద్, గంగాధరరావు, రెడ్డి శ్రీనివాస్ డాంగే పాల్గొన్నారు.

26న జెడ్‌పి స్థాయీ సంఘ సమావేశాలు

ప్రజాశక్తి - ఏలూరు

ఈ నెల 26న ఉమ్మడి పశ్చిమగోదావరి జెడ్‌పి స్థాయీ సంఘ సమావేశాలు జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు జెడ్‌పి సిఇఒ శ్రీహరి తెలిపారు. ఈ నెల 26వ తేదీ గురువారం ఉదయం 10:30 గంటలకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రజాపరిషత్ ఒకటి నుండి ఏడు వరకూ స్థాయీ సంఘ సమావేశాలు జెడ్‌పి కార్యాలయంలో నిర్వహిస్తామని తెలిపారు. సదరు సమావేశాలకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని మంత్రులు, ఎంపీలు, ఎంఎల్‌సిలు, జెడ్‌పిటిసిలు, అధికారులు హాజరవుతారని తెలిపారు.

పోలీస్ స్టేషన్ నిర్మించొద్దు : మెరక చేసి ఇవ్వండి

రెండో రోజు కొనసాగిన లబ్ధిదారుల రిలే దీక్ష

దీక్షలో కూర్చుని నినదిస్తున్న లబ్ధిదారులు

ప్రజాశక్తి - మండవల్లి

పోలీస్ స్టేషన్‌కు గతంలోనే స్థలం కేటాయించినప్పుడు పేదలను ఇబ్బందులకు గురి చేసేలా పేదల ఇళ్ల స్థలాలలో పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసే విధంగా నిర్ణయించడం సరైన పద్ధతి కాదని లబ్ధిదారులు స్పష్టం చేశారు. పేదల ఇళ్ల స్థలాలలో పోలీస్ స్టేషన్ నిర్మాణం నిలుపుదల చేసి మా భూములు మెరక చేసి ఇల్లు నిర్మించుకునేలా చేయాలని కోరుతూ తరుగుమూల ఇళ్ల స్థలాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి రెండో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ 20 ఏళ్లుగా ఇళ్ల స్థలాలు మెరక చేయాలని పోరాటం చేస్తుంటే పేదల గోడు వినిపించుకోకుండా పోలీస్ స్టేషన్ నిర్మాణానికి పేదల ఇళ్ల స్థలాలలో స్థలం ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. పేదలపై ఉన్న కక్షతోనే పేదలకు స్థలాలు దక్కకూడదనే ఉద్దేశంతో అధికారులు కావాలని పోలీస్ స్టేషన్‌కు స్థలం కేటాయించారని విమర్శిస్తున్నారు. వెంటనే పేదల ఇళ్ల స్థలాల్లో పోలీస్ స్టేషన్ నిర్మాణం నిలుపుదల చేసి పేదలు ఇళ్లు నిర్మించుకునేలా మెరక చేసి అప్పగించాలని వారు డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని వారు తెలిపారు.

వార్డు మెంబర్ ఇళ్ల స్థలాల లబ్ధిదారి భర్త రామారావు కన్నుమూత

తరుగుమూల పేదలకు కేటాయించిన ఇళ్ల స్థలాలలో ఇల్లు నిర్మించుకుందామని 20 ఏళ్లుగా ఎదురు చూసి చూసి మరో కన్ను మూతపడింది. సోమవారం రాత్రి తీవ్రమైన గుండె నొప్పికిలోనై వార్డు మెంబరు, లబ్ధిదారుని భర్త మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం బుద్ధుల రామారావు మంచాల తయారీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. 2019లో నిర్వహించిన పంచాయతీ ఎన్నికల్లో మూడో వార్డు నెంబర్‌గా పోటీ చేసి గెలుపొందాడు. రామారావు భార్యకు 2006లో తరుగుములు వద్ద ఇళ్ల స్థలం కేటాయించారు. ఇల్లు నిర్మించుకుందామని 20 ఏళ్లుగా భార్యాభర్తలు ఎన్నో కలలు కన్నారు. ఎంతోమంది నాయకులను, ప్రజాప్రతినిధులను కలిసి మెరక చేయాలని దండాలు దాసిల్లు పెట్టి అభ్యర్థించాడు. అయినా ఎవరు దయ చూపలేదు. ఆ స్థలంలో పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేస్తున్నారని తెలిసి మనస్థాపానికి గురయ్యాడు. తోటి లబ్ధిదారులతో కలిసి ఇళ్ల సాధనకై తరుగుమూల ఇళ్ల స్థలాల పోరాట కమిటీ పేరుతో రెవెన్యూ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించిన రిలే నిరాహార దీక్షలో పాల్గొన్నారు. దీక్ష అనంతరం ఇంటికి వెళ్లి మంచం తయారీ పనులను నిర్వహించుకుని, భోజనం చేసి నిద్రకు ఉపక్రమించే క్రమంలో సుమారు 11 గంటల సమయంలో తీవ్ర గుండె పోటు రావడంతో బంధువులు వైద్యం నిమిత్తం రామారావును ద్విచక్ర వాహనంపై కైకలూరు ఆసుపత్రికి తరలిస్తున్నారు. ఈ క్రమంలో భైరవపట్నం వద్ద ఉన్న రైల్వే గేటును రైలు రాకపోకల నిమిత్తం గేటు వేయడంతో ఆలస్యం అయిపోయింది. గేటు తీసిన అనంతరం హుటాహుటిన రామారావును కైకలూరు ప్రయివేట్ ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరిశీలించి అప్పటికే రామారావు మృతి చెందినట్లు గుర్తించినట్లు బంధువులు తెలిపారు. రామారావు మరణ వార్త విన్న కుటుంబం శోకసముద్రంలో మునిగిపోగా పేదల ఇండ్ల స్థలాల లబ్ధిదారులు ఒక్కసారిగా దిగ్భ్రాంతికి లోనయ్యారు. సమాచారం అందుకున్న వార్డు మెంబర్లు ఇళ్ల స్థలాల లబ్ధిదారులు రామారావు మృతదేహాన్ని మంగళవారం పరామర్శించి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అనంతరం సాయంత్రం రామారావు భౌతికకాయానికి అంతిమ సంస్కారాలు నిర్వహించారు.

శ్రీనివాస్, రామారావులకు సన్మానం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సచివాలయ ఉద్యోగుల తరపున కృషిచేసిన ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చోడగిరి శ్రీనివాస్, నేరుసు రామారావులను మంగళవారం ఇరిగేషన్ డేటా కాంప్లెక్స్‌లో సచివాలయ ఉద్యోగులు సన్మానించారు. మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీల పరిధిలో వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న సెక్రెటరీలను ఇతర మున్సిపాలిటీలకు బదిలీ చేయాలన్న నిబంధనలను తొలగించి అదే మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీలలో ఉన్న వార్డులకు బదిలీ చేయాలని ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు ఇచ్చిన నేపథ్యంలో కృషి చేసినందుకు ఈ కార్యక్రమం చేపట్టారు. ఇందుకోసం ఇటీవల వారికి సంబంధించిన బదిలీల మార్గదర్శకాలలో ఇతర మున్సిపాలిటీలకు బదిలీలు చేయాలన్న నిబంధనలు ప్రభుత్వం తీసుకొచ్చిన నేపథ్యంలో సచివాలయం ఉద్యోగుల తరపున ఎన్‌జిఒ అసోసియేషన్ నాయకులు సంబంధిత మంత్రితోను, అధికారులతో మాట్లాడి సచివాలయ ఉద్యోగులు ఇబ్బందులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. వెంటనే స్పందించిన ప్రభుత్వం మున్సిపాలిటీ పరిధిలోనే సెక్రటరీలను బదిలీ చేయాలని ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా కృతజ్ఞతాపూర్వకంగా ఏలూరు వార్డు సెక్రెటరీల బృందం శ్రీనివాస్, రామారావు లను సన్మానించారు. ఈ సందర్భంగా చోడగిరి శ్రీనివాస్ మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ఏర్పడనప్పటి నుంచి రాష్ట్రంలో ఉన్న సుమారు లక్షా ఇరవైదు వేల మంది తరపున గత ప్రభుత్వం నుంచి పోరాటం చేసి, వీరందరికీ ప్రొబేషన్ డిక్లరేషన్ చేయించి నేటి వరకు వీరి పక్షాన నిలబడ్డామని తెలిపారు. సచివాలయ ఉద్యోగులు ఎన్‌జిఒ సభ్యత్వం తీసుకోవాలని సూచించారు. సచివాలయ ఉద్యోగులు దుర్గాప్రసాద్, మనోజ్, నాయక్ పాల్గొన్నారు.



ఎన్‌జిఒ అధ్యక్ష కార్యదర్శులను సత్కరిస్తున్న ఉద్యోగులు

అభివృద్ధి ప్రతిభావంతులైన యువత వల్లే సాధ్యం : మంత్రి పార్థసారథి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

సీనియర్ ఇంటర్లో 991 మార్కులు సాధించిన నూజివీడు పట్టణ శారద జూనియర్ కళాశాల విద్యార్థి దేదీప్యసాయిని సన్మానించి, చిన్నారిని రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యకు వేలకోట్లు వెచ్చించి నూతన విద్యా విధానం చేపట్టిందని, తద్వారా విద్యలో నైపుణ్యం పెరిగి ప్రతీ ఒక్కరూ ప్రతిభ కనుబరుస్తున్నారన్నారు. విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ కార్యదీక్షతో ఆయనకున్న ప్రతిభ అనుభవంతో విద్యలో అనేక మార్పులు తెచ్చారని అన్నారు. విద్యా విధానంలో నూతన మార్పులు చేపట్టడం ద్వారా విద్యలో నాణ్యత పెరిగి ఉద్యోగ అవకాశాలు పెరిగాయన్నారు. కూటమి ప్రభుత్వంపై నమ్మకంతో బహుళ జాతి సంస్థలు ఇప్పటికే రాష్ట్రంలో లక్షల కోట్లతో పెట్టుబడులు పెట్టాయని రిలియన్స్, టాటా, మిట్టర్, మహేంద్ర వంటి సంస్థలు మన రాష్ట్రానికి తరలి వస్తున్నాయని తద్వారా యువతకు సుమారు 4.50 లక్షల ఉద్యోగాలు కల్పిస్తున్నామన్నారు. త్వరలో 17 వేల ఉపాధ్యాయ ఉద్యోగాలు నియమిస్తున్నామన్నారు. రానున్న 5 సంవత్సరాల కాలంలో సుమారు 20 లక్షల ఉద్యోగాలు నియమిస్తున్నామని మంత్రి అన్నారు. బావి భారత భవిషత్ అభివృద్ధి అంతా యువతదే అన్నారు. గొప్ప విజన్, కార్యదీక్ష, అపార అనుభవం కలిగిన మన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు వల్లే ఇవన్నీ సాధ్యమన్నారు. ఆయన నాయకత్వంలో రాష్ట్ర ఆర్థికాభివృద్ధి, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని, యువత అందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిభా అవార్డు గ్రహీతను సత్కరిస్తున్న మంత్రి

ప్రజల శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించం

ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్

దెందులూరు: దెందులూరు నియోజ వర్గ పరిధిలోని గ్రామాల్లో ప్రశాంత వాతావరణాన్ని చెడగొట్టాలనే కుట్రలతో, ప్రజల శాంతిభద్రతలకు ఎవరైనా సరే విఘాతం కలిగిస్తే వారిని ఉపేక్షించమని ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ స్పష్టం చేశారు. దుగ్గిరాలలోని క్యాంపు కార్యాలయంలో, ఏలూరులోని జెడ్‌పి అతిథి గృహం వద్ద మంగళవారం ఉదయం దెందులూరు నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సత్వరమే వాటిని పరిష్కరించేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పెదవేగి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చిన్నం రాజశేఖర్‌తో ఫోన్లో మాట్లాడుతూ 'గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ఉద్దేశపూర్వకంగా గొడవలు సృష్టిస్తున్న వ్యక్తులపై చట్టప్రకారం కఠిన చర్యలు చేపట్టాలని' సూచించారు. ఈ సందర్భంగా చింతమనేని మాట్లాడుతూ దెందులూరు నియోజకవర్గంలో గత ఐదేళ్లపాటు వైసిపి నాయకులు చేసిన అవినీతి అక్రమపాలన నుంచి ప్రజలకు విముక్తి లభించి ఏడాది కాలం పూర్తయిందన్నారు. ప్రజల ప్రశాంతమైన జీవనాన్ని చూసి ఓర్వలేక కొందరు వైసిపి అల్లరి మూకలు నిత్యం ఏదో ఒక రకంగా గొడవలు చేస్తున్నారన్నారు. గ్రామాల్లో గంజాయిని సైతం ప్రోత్సహించేలా కొందరు అసాంఘిక శక్తులు ప్రయత్నిస్తున్నారని ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.

పుస్తకాల వితరణ

ప్రజాశక్తి - ఉంగుటూరు

మండలంలోని సీతారాంపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గ్రామస్తుడు నడిమింటి దొరబాబు సొంత ఖర్చులతో నోట్ బుక్స్, పలకలు, పెన్సిళ్లు తదితర విద్యా సామగ్రి మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో గణపతి, దుర్గాప్రసాద్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పాఠశాల అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని ఉపాధ్యాయులు ధన్యవాదాలు తెలిపారు.

రహదారి అభివృద్ధికి ప్రతిపాదనలు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

అచ్యుతాపురం - శ్రీరంగపట్నం గ్రామాల మధ్య రహదారి అభివృద్ధికి రూ.30 లక్షల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు సిద్ధంచేసి పంపినట్లు ఎంపిడిఒ కె.కిరణ్ కుమార్ మంగళవారం తెలిపారు. ఈ రహదారి గతంలో అభివృద్ధి చేయకపోవడంతో ప్రజలు, ముఖ్యంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ విషయం తమ దృష్టికి రావడంతో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు యుద్ధ ప్రాతిపదికన రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు ఆదేశాలు జారీచేసినట్లు ఆయన వెల్లడించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఏలూరు : పెదవేగి మండలం, పెదవేగి సెక్షన్ పరిధిలో ఉన్న కూచింపూడి సబ్ స్టేషన్ పరిధిలో గల కూచింపూడి గ్రామానికి చెట్లు నరుకుట నిమిత్తం ఈనెల 25న బుధవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని ఏలూరు ఆపరేషన్ సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కెఎం.అంబేద్కర్ ప్రకటన ద్వారా తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించవలసిందిగా ఆయన కోరారు.

ప్రత్యేక అవసరాల పిల్లలకు ఉపకరణాల పంపిణీ

ప్రజాశక్తి - టి.నరసాపురం

ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు వినియోగించుకోవాలని మండల విద్యాశాఖాధికారి-2 ఎస్.కళ్యాణి తెలిపారు. స్థానిక మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాలలో గల భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఉచిత సహాయ ఉపకరణాలు మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కళ్యాణి మాట్లాడుతూ జిల్లా సమగ్ర శిక్షా వారు అందిస్తున్న ఉచిత సహాయ ఉపకరణాలు ప్రత్యేక అవసరాలు గల పిల్లలు వినియోగించుకుంటూ ఉన్నతంగా విద్యలో రాణించాలని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి.శిల్పి, ప్రత్యేక ఉపాధ్యాయులు కె.రాజు, పుల్లీరాజ్, ఫిజియోథెరపిస్టులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: వికలాంగులకు ఎన్బిఏ పెన్షనర్స్ క్లబ్ ఆధ్వర్యంలో కృత్రిమ కాళ్లను అందజేయడం ఎంతో అభినందనీయమని హీల్ సిఇఒ కె.అజయ్కుమార్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని తోటపల్లి హీల్ కృత్రిమ అవయవ కేంద్రంలో నాగార్జునసాగర్‌కు చెందిన డి.అంచిత, తెలంగాణా రాష్ట్రం సూర్యాపేటకు చెందిన బి.యస్వంతలకు ఎన్బిఏ పెన్షనర్స్ క్లబ్ ఆధ్వర్యంలో కృత్రిమ కాళ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్స్ క్లబ్ సభ్యులు జి.కృష్ణమూర్తి, సంఘ సేవకులు టి.భోగేశ్వరరావు, హీల్ కార్యదర్శి టి.లక్ష్మీ, సిబ్బంది పాల్గొన్నారు.

భూ ఆక్రమణలు తొలగించాలని వినతి

టి.నరసాపురం : ఆక్రమణకు గురైన దళితుల భూముల్లో ఆక్రమణలు తొలగించి దళితులకు న్యాయం చేయాలని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొండపల్లి రవి కోరారు. రాష్ట్ర ఎస్సి కమిషన్ చైర్మన్ కొత్తపల్లి శామ్యూల్ జవహర్‌ని విజయవాడలోని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేసినట్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

స్థానిక సమస్యలపై పోరాటాలకు సిద్ధం కండి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

కొయ్యలగూడెం : కన్నాపురంలో సిపిఎం జిల్లా స్థాయి శిక్షణ తరగతుల ముగింపు సందర్భంగా జరిగిన సభలో కార్యకర్తలు గ్రామాల్లో స్థానిక సంస్థలపై గుర్తించిన ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్మించాలని జిల్లా కార్యదర్శి ఎ.రవి పిలుపునిచ్చారు. 'స్మార్ట్ మీటర్లు మాకు వద్దు' అనే నినాదంతో వ్యతిరేక పోరాటాలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు రామకృష్ణ, గురుగెల వెంకట్రావు, జీవరత్నం, తెల్లం దుర్గారావు, నాగమణి, ఎస్.రాంబాబు, బుల్లెమ్మ పాల్గొన్నారు.

ప్రశాంతంగా మెగా డిఎస్సి

ఏలూరు అర్బన్ : మెగా డిఎస్సి-2025 పరీక్షలు సోమవారం ఏలూరులో ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 9 గంటల నుంచి 10:30 వరకు సిద్ధార్థ క్వెస్ట్ పాఠశాలలో 180 మందికి 144 మంది హాజరు కాగా 36 మంది గైర్హాజరయ్యారు. సిఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన పరీక్షకు మొత్తం 207 మందికి 170 మంది హాజరు కాగా 37 మంది గైర్హాజరయ్యారు. ఏలూరు ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్ష జరగలేదు. మొత్తం 2 కేంద్రాలలో 387 మందికి 314 మంది హాజరు కాగా 73 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 12:30 నుంచి 2 గంటల వరకు జరిగిన పరీక్షలకు సిద్ధార్థ క్వెస్ట్‌లో 179 మందికి 154 మంది హాజరు కాగా 25 మంది గైర్హాజరయ్యారు. ఏలూరు ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్ష జరగలేదు. సిఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన పరీక్షలకు మొత్తం 207 మందికి 171 మంది హాజరు కాగా 36 మంది గైర్హాజరయ్యారు. మొత్తం 2 కేంద్రాలలో 386 మందికి 325 మంది హాజరు కాగా 61 మంది గైర్హాజరయ్యారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి ఐదున్నర గంటల వరకు సిఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన మూడవ షిఫ్ట్‌లో 207 మందికి 161 మంది హాజరు కాగా 46 మంది గైర్హాజరయ్యారు.

పచ్చిరొట్ట విత్తనాల ద్వారా భూసారం పెంపు

పలుచోట్ల 'పొలం పిలుస్తుంది'

ప్రజాశక్తి - ముసునూరు

పచ్చిరొట్ట విత్తనాల ద్వారా భూసారాన్ని పెంపొందించుకోవాలని మండల వ్యవసాయ అధికారిణి ఎ.చాముండేశ్వరి రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని రమణక్కపేట, లోపూడి గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రైతు భూసార పరీక్షలు నిర్వహించుకుని భూసార పరీక్షలు ఆధారంగా తమ పొలంలో ఎరువులు వేసుకోవాలని, అధికంగా రసాయనిక ఎరువులు వాడిన యడల భూమిలోని సారం తగ్గి, దిగుబడులు తగ్గిపోయే పరిస్థితి ఉందని, అలాగే పచ్చిరొట్ట విత్తనాలు, పిఎండిఎస్ కిడ్స్(నవధాన్యాలు) పూత దశలో పొలంలో కలయ దున్నినట్లయితే పోషక విలువలు పెరిగి భూసారం పెరగడంతో పాటు, అధిక దిగుబడులు పొందవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన, సర్పంచి రంగు ధనలక్ష్మి గాంధీ, టిడిపి నాయకులు వేంపాటి శ్రీనివాసరావు, చలమాల వెంకటేశ్వరరావు, లక్కపాము కాంతారావు, రైతులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: వరి నారుమడి దశలోనే రైతులు సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులను సాధించవచ్చునని, నూతన సాగు విధానాల ద్వారా రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడమే పొలం పిలుస్తుంది కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమని ఆగిరిపల్లి మండల వ్యవసాయాధికారిణి జె.భవాని అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బొద్దనపల్లి, కొత్త ఈదర గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులకు నారు వేసే విధానం, వరినాట్లు వేసే ముందు తీసుకోవలసిన సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆగిరిపల్లి మండల ఉద్యానశాఖాధికారి కె.జ్యోతి ప్రియాంక, రైతులు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

ఏలూరు స్పోర్ట్స్ : రైలు పట్టాలు దాటుతున్న వ్యక్తిని ప్రమాదవశాత్తు రైలు ఢీకొనడంతో అతను ఘటనా స్థలంలోనే మృతిచెందిన ఘటన ఏలూరు నగరంలో మంగళవారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు నగరంలోని కొత్తపేటకు చెందిన పులప మహేష్(32) స్థానికంగా ఒక జువెలరీ దుకాణంలో సేల్స్‌మెన్‌గా పనిచేస్తూ కుటుంబ సభ్యులతో కలిసి జీవిస్తున్నాడు. ఈక్రమంలో మంగళవారం ఇంటి సమీపంలో రైలు పట్టాలను దాటుతుండగా గుర్తుతెలియని రైలు బండి వేగంగా వచ్చి అతన్ని ఢీ కొట్టింది. ఈ ఘటనలో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించిన రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్ఆర్ విగ్రహం పాక్షికంగా ధ్వంసం

ఏలూరు స్పోర్ట్స్ : ఏలూరు నగరంలోని ఓ ప్రధాన కూడలి వద్ద ఏర్పాటుచేసిన కీర్తిశేషులు వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని గుర్తుతెలియని దుండగులు పాక్షికంగా ధ్వంసం చేశారు. ఈ ఘటన ఏలూరు నగరంలోని దుగ్గిరాల సర్కిల్లో చోటుచేసుకుంది. అయితే మంగళవారం ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ ఘటన జరిగి రెండు రోజులు అవుతున్నట్లు పోలీసులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. మంగళవారం ఉదయం స్థానిక వైసిపి నేతలు ఈ విషయాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు. ఈ ఘటనపై మూడో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయనున్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ఫీజుల దందా

స్కూల్ యాప్, అదనపు యాక్టివిటీస్ పేరుతో వసూళ్లు..

ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడీని నియంత్రించాలి

విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలి

తల్లిదండ్రుల వేడుకోలు

ప్రజాశక్తి - చింతలపూడి

అక్షరాలు దిద్దించేందుకే మండలంలోని ఒక కార్పొరేట్ స్కూల్ అధిక ఫీజుల వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను నిలువునా దోచేస్తున్నారు. ప్రతి సంవత్సరం 20 శాతం ఫీజులు పెంచుకుంటూ పోతుంటే ఆ ఫీజులు చెల్లించలేక తల్లిదండ్రులు నానా ఇబ్బందులు పడుతున్నారు. యాప్ డెవలప్మెంట్ పేరుతో, అదనపు యాక్టివిటీస్ అని దొరికినకాడికి దోచుకుంటున్నారు. ఆ కార్పొరేట్ స్కూల్‌లో సుమారుగా 1400 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ 1400 మంది నుంచి రూ.3 వేల వరకు తల్లిదండ్రులకు ఎటువంటి ఉపయోగం లేకపోయినా బలవంతంగా స్కూల్ రూల్స్ అని వసూలు చేస్తూ సంవత్సరానికి సుమారుగా రూ.43 లక్షలు వసూలు చేస్తూ దోచుకుంటున్నారు.

మండలంలోని ప్రయివేట్, కార్పొరేట్ స్కూల్‌పై ఉన్నత, ప్రజాప్రతినిధులు దృష్టి పెట్టకపోవటంతో ఇష్టానుసారంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్నారు. యుకెజికి రూ.17 వేల ఫీజులు మొదలు, వారి పుస్తకాలకి 7 వేలు, బస్సు 7 కిలోమీటర్లు దాటితే రూ.14 వేలు ఒక్క యుకెజి విద్యార్థిని చదివించాలి అంటే సంవత్సరానికి రూ.50 వేలు చెల్లించాల్సిందే.

ఒక్కొక్కరికి ఒక రకమైన ఫీజు. అడిగిన వారికి 2 వేలు తగ్గించి, వేరే వాటిలో పెంచి ఏవిధంగా అయినా సామాన్య తల్లిదండ్రుల జోబులకు చిల్లు పెడుతున్నారు. 1 వ తరగతికి గత సంవత్సరం రూ.23 వేలు ఫీజు ఉండగా, ఇప్పుడు రూ.26 వేలకు పెంచారు. గత సంవత్సరం ఫీజులు కంటే 20 శాతం పెంచుకుంటూ పోతున్నారు.

స్కూల్ యాప్ వల్ల మాకేంటి ఉపయోగం?

స్కూల్ యాప్ వల్ల మాకు ఉపయోగం ఏంటి అని, దాని కోసం రూ.2 వేలు వసూలు చేస్తున్నారని, మాకు అవసరం లేదు, ఉపయోగం లేదని తల్లిదండ్రులు గోల పెడుతున్నారు. స్కూల్ రూల్స్ అని చెప్పి, బలవంతంగా వసూలు చేస్తున్నారని వాపోతున్నారు. సాయంత్రం విద్యార్థులతో ఆటలు ఆడించినందుకు రూ.900 వసూలు చేస్తున్నారు. గత 3 సంవత్సరాలుగా ఇలా అనేక విధాలుగా వసూలు చేస్తున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు, ప్రజాప్రతినిధులు పర్యవేక్షణ లేకపోవటంతో ఫీజులు ఇష్టానుసారం పెంచేస్తున్నారు. వారు నిర్ణయించిన తేదీల్లో చెల్లించకుంటే కనీసం సమయం కూడా ఇవ్వకుండా విద్యార్థుల తల్లిదండ్రుల గ్రూపుల్లో ఫీజు చెల్లించలేదంటూ పేర్లు పెట్టి పరువు తీస్తున్నారు. దీంతో చిన్నారులు బాధపడాల్సి వస్తుంది. కనీసం వెసులుబాటు కూడా ఇవ్వడం లేదు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ఈ దోపిడీకి అడ్డుకట్ట వేయాలని విద్యార్థుల తల్లితండ్రులు కోరుకుంటున్నారు.

మాకు ఉపయోగం లేకున్నా.. వసూలు చేస్తున్నారు

భూక్యా గోపి

స్కూల్ యాప్ అని, అదనపు యాక్టివిటీస్ అని రూ.2,900 వసూలు చేస్తున్నారు. మాకు అవసరం లేదని చెబుతున్న బలవంతంగా స్కూల్ యాజమాన్యం చెప్పింది చేయాలి అంటున్నారు. వాటివల్ల మాకు ఎటువంటి ఉపయోగం లేదు. స్కూల్‌లో 1400 మంది విద్యార్థులు ఉన్నారు. సంవత్సరానికి సుమారుగా రూ.43 లక్షలు వసూలు చేస్తున్నారు.

ఫీజులపై నియంత్రనుండాలి

బి.స్వామి నాయక్

ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలపై అధికారుల పర్యవేక్షణ, లేదా ప్రజాప్రతినిధుల జోక్యం ఉండాలి. ఫీజుల పరిస్థితి దారుణంగా ఉంది. మండలం మెట్ట ప్రాంతం. ఫీజుల విషయంలో నియంత్రన ఉండాలి. అదనపు ఫీజుల వల్ల ఇంకా ఇబ్బంది.

అధికారులు దృష్టి పెట్టాలి

బి.ప్రభుకుమార్

అదనపు వసూలు, ఫీజుల భారంతో ఇబ్బంది పడుతున్నాం. యాప్ వల్ల మాకు ఎటువంటి ఉపయోగం లేదు. ఈ అదనపు వసూలుపై అధికారులు దృష్టి పెట్టి నియంత్రించాలి. మాకు న్యాయం చేయాలి.

విద్యార్థులకు సత్కారం

ఉంగుటూరు : పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించి ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన నారాయణపురం వివేకనంద జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు గుడ్ల హర్ష ప్రియ, జుత్తిగ అభినయశ్రీలను మంగళవారం సత్కరించారు. హర్షప్రియ ఒంగోలులో, అభినయశ్రీ శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో ఉచితంగా సీటు సాధించారు. ప్రభుత్వ పాఠశాలలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యా బోధన లభిస్తోంది అనడానికి ఈ విద్యార్థులే నిలువెత్తు సాక్ష్యం అని ప్రధానోపాధ్యాయులు తోట పోతురాజు అన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఆశశ్రీ సౌమ్య

టి.నరసాపురం : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదివిన విద్యార్థిని పసుపులేటి ఆశశ్రీ సౌమ్య ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు బిఎల్.స్వామి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆశాశ్రీ సౌమ్య 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో 579 మార్కులు సాధించి ఒంగోలు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఆశాశ్రీ సౌమ్యకు మండల విద్యాశాఖాధికారులు టి.రామ్మూర్తి, ఎస్.కళ్యాణి, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందనలు తెలిపారు.

వేగవరం విద్యార్థికి ట్రిపుల్ ఐటీలో సీటు

జంగారెడ్డిగూడెం : మండలంలోని వేగవరం గ్రామానికి చెందిన నల్లగోపు సామ్యూల్ రాజ్‌కి శ్రీకాకుళం ట్రిపుల్ ఐటి కాలేజీలో మొదటి లిస్టులోనే సీటు వచ్చిందని వేగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు భూపతి రామారావు తెలియజేశారు. విద్యార్థి సామ్యూల్ రాజ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివి మండల స్థాయిలోనే పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 573 మార్కులతో ప్రథమ స్థానం సాధించారన్నారు. మా పాఠశాలలో చదివి ట్రిపుల్ ఐటీలో సీటు సాధించడం మాకు ఎంతో గర్వకారణమని ఆ విద్యార్థిని అభినందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, టీచర్లు, తల్లిదండ్రులు కూడా ఎంతగానో ఆనందపడుతున్నట్లు తెలియజేశారు.

ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో సీటు

కొయ్యలగూడెం : పరింపూడి జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని తోట భార్గవి లక్ష్మీ దుర్గ పదో తరగతి పరీక్షల్లో 580 మార్కులు సాధించి మండల స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల్లో టాపర్‌గా నిలిచింది. ఈ అద్భుత విజయంతో ఆమె ఇడుపులపాయలోని ట్రిపుల్ ఐటీలో సీటు సాధించింది. భార్గవి తల్లిదండ్రులు సూర్యనారాయణమ్మ, సుబ్బారావు వ్యవసాయ వృత్తిని కొనసాగిస్తున్నారు. హెచ్ఎం ఉమాదేవి, ఉపాధ్యాయులు అభినందించారు.

ట్రిపుల్ ఐటీకి జెడ్‌పి విద్యార్థులు

హర్ష వర్ధిని

సాయి నాగచందు

కలిదిండి : మండల స్థాయిలో 10వ తరగతి ఫలితాలలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల షైనింగ్ స్టార్స్ విద్యార్థులు నాయుడు హర్ష వర్ధిని(586 మార్కులు), మారుబోయిన సాయి నాగచందు(576 మార్కులు) ఇరువురు నూజివీడు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయిని బి.స్వర్ణ కుమారి తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు స్వర్ణ కుమారి, పాఠశాల సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

అర్హులైన గిరిజనులకు మౌలిక వసతులు కల్పిస్తాం : ఎంపిడిఒ

జీలుగుమిల్లి : జాతీయ గ్రామ ఉత్కర్ష అభయాన్ కార్యక్రమంలో భాగంగా అర్హులైన గిరిజనులకు మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు ఇన్‌ఛార్జి ఎంపిడిఒ నిఖిల్ మధుశరణ్ తెలిపారు. మంగళవారం మండలంలోని టి.గంగన్న గూడెం గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పలువురు గిరిజనుల నుంచి పలు పథకాలకు సంబంధించి అర్జీలు స్వీకరించారు. అనంతరం ఎంపిడిఒ మాట్లాడుతూ ధర్తి జనాభగిదారి అభియాన్ పిఎం ప్రచార కార్యక్రమంలో భాగంగా అర్హులైన గిరిజనులకు మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పలువురు గ్రామస్తులు తమ గ్రామంలో రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలని వినతి పత్రాన్ని అందజేసినట్లు తెలిపారు.

అంకలగూడెం గ్రామస్తుల ఔదార్యం

పాఠశాల విద్యార్థుల కోసం వాహనం ఏర్పాటు

సొంత ఖర్చుతో వాహనం సమకూర్చిన గ్రామస్తులు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలోని అంకలగూడెం గ్రామ ప్రజలు విద్య పట్ల తమ నిబద్ధతను చాటుకున్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం తక్కువగా ఉండడాన్ని గమనించిన గ్రామస్తులు వాహన సౌకర్యం లేకపోవడమే దీనికి కారణమని గుర్తించారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు సొంత ఖర్చులతో విద్యార్థుల రాకపోకల కోసం వాహనాన్ని సమకూర్చారు. మంగళవారం గ్రామ పెద్దలు ఈ వాహనాన్ని ప్రారంభించారు. ప్రతిరోజూ విద్యార్థులను పాఠశాలకు తీసుకువెళ్లి, తిరిగి ఇంటికి తీసుకురావడం వాహనదారుని బాధ్యతగా గ్రామ పెద్దలు పేర్కొన్నారు. గ్రామస్తుల ఈ సౌజన్య చర్య విద్యార్థుల విద్యా అవకాశాలను మెరుగుపరచడంతో పాటు, గ్రామంలో విద్య పట్ల అవగాహనను పెంచే దిశగా ఆదర్శంగా నిలిచింది.

టిడిపి ఏడాది పాలనలో ప్రజలపై భారాల మోత

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ఏలూరు అర్బన్ : బిజెపితో జతకట్టి రాష్ట్ర ప్రభుత్వాన్ని నడుపుతున్న టిడిపి ఏడాది పాలన పూర్తయిందని, ఈ పాలనలో ప్రజలపై విపరీతమైన భారాలు పడ్డాయని, స్మార్ట్ మీటర్ల పేరుతో విద్యుత్ భారాలు మోపారని, సూపర్ సిక్స్ పథకాలు నామమాత్రంగా అమలు చేయడమే తప్ప రాష్ట్ర ప్రజలకు మేలు చేసింది ఏమీ లేదని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి తీవ్రంగా విమర్శించారు. రెండు రోజులపాటు జరగనున్న సిపిఎం జిల్లాస్థాయి శిక్షణ తరగతులు మంగళవారం ఉదయం ఏలూరులోని పవర్ పేటలో గల ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో ప్రారంభమయ్యాయి. ముందుగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన సిపిఎం జిల్లా శాఖాకార్యదర్శులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు సిపిఎం జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. చింతలపూడికి చెందిన సిపిఎం జిల్లా సీనియర్ నాయకులు ఆర్‌విఎస్.నారాయణ జెండావిష్కరణ చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.రామకృష్ణ క్లాసులకు ప్రిన్సిపల్‌గా వ్యవహరించారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి శిక్షణా తరగతులను ప్రారంభిస్తూ దారి తప్పుతున్న టిడిపి కూటమి ఏడాది పాలనపై 'కార్పొరేట్లకు వరాలు - పేదలకు శాపాలు'అనే బుక్ లైట్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా వచ్చిన పరిశ్రమలు ఎక్కడని, ఎంతమంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించారని ఆయన ప్రశ్నించారు. నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి, యువతకు 25 లక్షల ఉద్యోగాలు, రైతుకు గిట్టుబాటు ధర, ప్రతి మహిళకు రూ.1500 నెలకు బ్యాంకులో వేయడం, ఉచిత బస్సు ప్రయాణం, 50 సంవత్సరాలు నిండిన బిసి, ఎస్‌సి, ఎస్‌టిలకు పెన్షన్ వంటి పథకాలు ఇంకా అమలుకు నోచుకోలేదని అన్నారు. మరో పక్క బిజెపి మతం పేరుతో, కులం పేరుతో ప్రజల మధ్య దూరాన్ని పెంచి, ఐక్యతను దెబ్బతీస్తుంటే జనసేన అధినేత పవన్ కళ్యాణ్ బిజెపి విధానాలకు వత్తాసు పలుకుతూ మత రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. ఈ శిక్షణా తరగతులలో ఉదయం పూట 'నయా ఉదారవాద ఆర్థిక విధానాలు' అనే అంశాన్ని ఆర్.లింగరాజు, సాయంత్రం 'హిందుత్వ రాజకీయాలు - ప్రతిఘటన పద్ధతులు' అనే అంశాన్ని గుడిపాటి నరసింహారావు బోధించారు. ఈ క్లాసుల్లో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్, జి.రాజు, కె.శ్రీనివాస్, జిల్లా నాయకులు ఎస్.మహంకాళి పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

చింతలపూడి : యువతలో పెరుగుతున్న సైబర్ నేరాలు, సోషల్ మీడియా వాడకంలో జాగ్రత్తలు, వ్యక్తిగత సమాచారం రక్షణ, ఆన్‌లైన్ మోసాలపై చింతలపూడి సిఐ క్రాంతికుమార్ హెచ్చరించారు. చింతలపూడి పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో హయగ్రీవా గర్ల్స్ జూనియర్ కాలేజీ ఇంటర్మీడియట్ విద్యార్థులకు మానసిక ఒత్తిడికిలోనవ్వకుండా ఉండేందుకు చింతలపూడి పోలీసులు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాభారం, కుటుంబ ఒత్తిడులు వంటి సమస్యలతో మానసిక ఒత్తిడికి లోనవ్వకుండా ఉండటానికి విద్యార్థులు తీసుకోవలసిన జాగ్రత్తలపై మార్గదర్శనం చేశారు. బాలల రక్షణ కోసం ఉన్న పోక్సో చట్టం గురించి వివరణ, దాని కింద వచ్చే నేరాలు, బాధితులు తీసుకోవలసిన చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు విద్యార్థుల సందేహాలను తొలగిస్తూ వారు మానసికంగా, ఆరోగ్యంగా ఉండేందుకు అందుబాటులో ఉన్న సహాయక వనరులు, హెల్ప్‌లైన్ నెంబర్లను తెలియజేశారు. విద్యార్థుల్లో నైతిక స్థైర్యం, చట్టాల పట్ల అవగాహన పెంపొందించడంతో పాటు వారు భవిష్యత్తులో బాధ్యతాయుతంగా తీరు అనుసరించేందుకు సలహాలు, సూచనలు తెలియజేశారు. కార్యక్రమంలో చింతలపూడి ఎస్ఐ సతీష్, కళాశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

నూజివీడు టౌన్ : మండలంలోని అన్నవరం గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో చాలా సంవత్సరములు ఈ స్కూల్‌లో పనిచేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను ఆ పాఠశాల ఉపాధ్యాయులు నూతన వస్త్రములు బహూకరించి ఘనంగా సన్మానించారు. లెక్కలు ఉపాధ్యాయుని జీవనజ్యోతి, ఇంగ్లీషు ఉపాధ్యాయులు ప్రవీణ్, వ్యాయామ ఉపాధ్యాయిని ఆరతిలను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగేంద్రరావు, నాగరాజు, దుర్గామల్లేశ్వరరావు, రవీంద్ర, ఫిలోమిన, జయకుమారి, మంగలక్ష్మి పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల్లో భారీ అవినీతి

నిధులు పక్కదారి పట్టించిన ఫీల్డ్ అసిస్టెంట్లు!

గ్రామానికి లక్ష నుండి ఐదు లక్షల వరకు రికవరీ

ప్రజాశక్తి - మండవల్లి

గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో భారీ అవినీతి చోటుచేసుకుందని అధికారులు నిగ్గు తేల్చారు. దీంతో వలసలను తగ్గించే విధంగా ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పనులు ఫీల్డ్ అసిస్టెంట్లకు వరంగా మారిందనటంలో ఎటువంటి సందేహం లేదు. దీనికి నిదర్శనమే మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఉపాధి పనులపై నిర్వహించిన ప్రజావేదికలో వెలుగు చూసిన విషయాలు. ఉపాధి హామీ చట్టం ద్వారా గ్రామాలలో కాలువలను మరమ్మతులు చేయలేదని, కొలతలు తేడాగా ఉన్నాయని, కనీసం పారతో మట్టి అయినా తీయకుండానే అడుగుమేరా మట్టి తీసినట్లు రికార్డులు రాశారని సామాజిక తనిఖీలో వెల్లడైంది. ఉపాధి పనులు నిర్వహించినట్లు ఆధారంగా ఫొటోలు కూడా లేకపోవడం ప్రజా వేదికలో అధికారులు గుర్తించారు. కానుకొల్లులో 400 మొక్కలు నాటినప్పటికీ వాటిల్లో కేవలం 105 మాత్రమే ఉన్నాయని, అయినప్పటికీ 251 నుంచి 300 మొక్కలు ఉన్నాయని, వాటికి నీళ్లు పోసినట్లు ఉపాధి పనుల ద్వారా డబ్బులు డ్రా చేశారని అధికారులు గమనించారు. రుద్రవరంలో 480 మొక్కలు నాటినప్పటికీ 210 మాత్రమే మిగిలాయని, అవి కూడా చనిపోయే స్థితిలో ఉన్నాయని, నీళ్లు పోసినట్లు, పర్యవేక్షించినట్లు, డబ్బులు విత్ డ్రా చేయడం జరిగిందని గుర్తించారు. చావలపాడులో పనిచేసే వ్యక్తులకు నీళ్లు పోయకుండానే రూ.24 వేలు విత్ డ్రా చేశారని, పనులు జరగకపోయినా జరిగినట్లు చూపించి లక్షల రూపాయలు తీసుకున్నారన్నారు. భైరవపట్నంలో యాక్సిడెంట్ అయి ఇంటి వద్దనే ఉంటున్న వ్యక్తి పనికి వచ్చి నీళ్లు పోసినట్లు చూపించి రూ.22 వేలు, కాలువలు పూడిక పనులు చేయకుండానే చేసినట్లు చూపించి రూ.35 వేలు, అప్పాపురంలో ఒకే పనిని రెండుసార్లు నిర్వహించినట్లు మండవల్లి, రుద్రవరం గ్రామాలకు చెందిన వ్యక్తులు చేసిన పనులను అప్పపురం వ్యక్తులు చేసినట్లు ఫొటోలను చూపించి వేల రూపాయలు తీసుకున్నారని ప్రజా వేదికలో వెల్లడైంది. గున్నన్నపూడిలో పనులు కల్పించాలని కోరినప్పటికీ పనులు కల్పించలేదని, కొవ్వాడ లంకలో పనులను ఎవరు పర్యవేక్షించకపోవడంతో ఉపాధి హామీ పనులు ఆడింది ఆటగా, పాడింది పాటగా సాగిందన్నారు. నందిగామ లంకలో కొత్త కార్డు నమోదు చేసుకోవడానికి రెండు వందల రూపాయలు, రెన్యువల్ చేయడానికి రూ.150 చొప్పున ఫీల్డ్ అసిస్టెంట్ వసూలు చేశారని, నచ్చినవారికి అకౌంట్లో డబ్బులు వేసి కూలి అసిస్టెంట్ చెరుసగం పంచుకున్నారన్నారు. ఇందు నిమిత్తం రెండు లక్షల 78 వేల రూపాయలు ఉపాధి హామీ నిధులు దుర్వినియోగం అయినట్లు అధికారులు తేల్చారు. ఈ సందర్భంగా ఎపిడి పురుషోత్తం ప్రజావేదికలో ఉపాధి పనులు నిర్వహించే పరిస్థితి ఎలా అంటూ ఫీల్డ్ అసిస్టెంట్లను హెచ్చరించారు. రికార్డులు సక్రమంగా నిర్వహించకుండా పనులు ఎలా చేస్తున్నారని ప్రశ్నించారు. ఏ పనైనా చేసేటప్పుడు, పనిని ప్రారంభించినప్పుడు, చేస్తున్నట్లు, ముగిసినట్లు రుజువు చేసేలా ఫొటోలను సక్రమంగా తీసుకోవాలని అన్నారు. నిబంధన ప్రకారం పనులు ఉంటేనే బిల్లులు చెల్లిస్తామని, లేనిపక్షంలో రికవరీ చేయిస్తామని అన్నారు. కొల్లేరు ప్రాంతంలో ఎక్కువ శాతం కాలువలే ఉంటాయని, అవి ఎప్పుడు నీటితో నిండి ఉంటాయని, ఇప్పుడు ప్రజావేదిక నిర్వహించడం ద్వారా ఎక్కువ రికవరీ పడే పరిస్థితులు ఉన్నాయని, దీనిపై అధికారులు పరిశీలించాలని కూటమి నాయకులు అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో స్టేట్ సోషల్ ఆడిట్ ప్రోగ్రాం మేనేజర్ సునీల్ కుమార్, ఎపిడి జాన్ విక్టర్ డివిఒఎం.బుజ్జి, ఎస్ఆర్‌పి.వెంకటేశ్వర్లు, ఎంపిపి పెద్దిరెడ్డి శ్రీరామదుర్గ ప్రసాద్, ఎంపిడిఒ కె.రామలింగేశ్వరరావు, భలే యేసురాజు, ముంగర ఏడుకొండలు పాల్గొన్నారు.

సచివాలయాల ఉద్యోగుల పట్ల సానుకూలంగా ఉన్నాం : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఇటు ప్రభుత్వానికి, అటు ప్రజలకు వారధులుగా నిలుస్తూ అనేక సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలయ్యేందుకు పాటుపడుతోన్న సచివాలయాల ఉద్యోగుల పట్ల కూటమి ప్రభుత్వమెప్పుడూ సానుకూల దృక్పథాన్నే కనబరుస్తూ వచ్చిందని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి వెల్లడించారు. వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీ ప్రక్రియలో కూటమి ప్రభుత్వం సడలింపునిచ్చిందని అన్నారు. దీనికి సంబంధించి సోమవారం జిఒ ఎంఎస్ నెంబరు 6ను విడుదల చేసిందని, ఇంతకుముందు గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీకి సొంత మండలాన్ని పరిగణనలోకి తీసుకోవాలని మార్గదర్శకాలు విడుదల చేసిన ప్రభుత్వం మున్సిపల్ కమిషనర్ల నుంచి వచ్చిన వినతుల మేరకు పట్టణ ప్రాంతాల్లోని వార్డు సచివాలయ ఉద్యోగులకు సొంతవార్డు కాకుండా, అదే పట్టణ పరిధిలోని ఇతర వార్డుల్లోకి బదిలీలు చేసుకునే అవకాశాన్ని కల్పిస్తూ నిర్ణయం తీసుకుందని అన్నారు. ఈ సవరణలతో సంతోషం వ్యక్తం చేసిన ఏలూరు పరిధిలోని వార్డు సచివాలయాల్లో విధులు నిర్వహిస్తోన్న ఉద్యోగులు కృతజ్ఞతాపూర్వకంగా ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటిని కలిసి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఉమ్మడి జిల్లా రీజనల్ కో - ఆర్డినేటర్, సచివాలయ ఉద్యోగుల జెఎసి చైర్మన్ జివిఎస్.శ్రీనివాస్, జెఎసి జనరల్ సెక్రెటరీ దుర్గాప్రసాద్, ట్రెజరర్ రెడ్డి చైతన్య, ప్రసన్న, సునీత, అబ్రహాం, హర్ష, జ్యోతి, షాహిద్ ఎంఎల్ఎను కలిసిన వారిలో ఉన్నారు.

ప్రగతి పథంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు పట్టణంలోని ఎంప్లాయిస్ కాలనీలోని మదుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మంగళవారం కళాశాల సాధించిన ప్రగతిపై కరపత్రాలు విడుదల చేశారు. పోటీ ప్రపంచంలో మేము ఎవరికీ తక్కువ కాదు.. తక్కువ చేసి చూడవద్దు.. ఏలూరు జిల్లాలోని అత్యధిక మార్కులు సాధించిన కళాశాల తమదే అంటూ అధ్యాపకులు విద్యార్థులు సైతం నినదించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పాతూరి తేజేంద్ర మాట్లాడుతూ గడచిన 42 సంవత్సరాలుగా నూజివీడు పట్టణంలో విద్యార్థులకు మంచి విద్యను అందించి ఎందరో విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్ది, బంగారు భవితను అందించినట్లు చెప్పారు. సాధారణమైన విద్యార్థులతో అసాధారణ ఫలితాలు సాధించటం మా కళాశాల ప్రత్యేకతగా చెప్పవచ్చునన్నారు. ఈ కళాశాలలో ఎంపిసి కోసం 8121721129, బైపిసి 9441419188, సిఇసి కోర్సు కోసం 9704303025, హెచ్ఇసి 9440983852, ఎంపిహెచ్‌డబ్ల్యు కోర్సుకు 8328361038, ఎంఎల్‌టి 9963747474, సిఎస్ఇ 8790665937, సిఇటి 7013187819 నంబర్లలో సంప్రదించవచ్చు అన్నారు. ప్రస్తుతం అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతోందని పేద, మధ్యతరగతి విద్యార్థులు తమ కళాశాలలో చేరి మంచి విద్యను పొంది బంగారు భవితకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని తెలిపారు.

బిసి హాస్టల్ విద్యార్థుల భిక్షాటన

నూజివీడు టౌన్ : నూజివీడు పట్టణంలో బిసి హాస్టల్ విద్యార్థులు సోమవారం వినూత్న రీతిలో భిక్షాటన చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్ఎఫ్) నూజివీడు పట్టణ సమితి ఆధ్వర్యంలో బిసి వెల్ఫేర్ బాలుర వసతిగృహంలో కుక్, కమోడిటీ, వాచ్మెన్ లేకపోవడంతో తామే స్వయంగా భోజనాలు వండుకోవలసి వస్తుందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బిసి బాలుర వసతిగృహం నుంచి నూజివీడు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్‌ని కలిసి వినతిపత్రం అందజేశారు. ఎఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి ఎం.క్రాంతి కుమార్ పాల్గొన్నారు.

మద్ది ఆంజనేయస్వామి ఆలయం వద్ద వైద్య శిబిరం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని గురవాయిగూడెం గ్రామంలోని శ్రీమద్ది ఆంజనేయస్వామి వారి ఆలయం వద్ద బొర్రంపాలెం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వారు వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. పలువురు భక్తులు వైద్యసహాయం పొందారు. మధ్యాహ్నం వరకు దేవస్థానమునకు వివిధ సేవలు, విరాళాల ద్వారా రూ.2,15,016లు సమకూరింది. సుమారు 1200 మంది భక్తులకు స్వామివారి నిత్యాన్నదాన సత్రంలో అన్నప్రసాద వితరణ చేశారని దేవస్థానం కార్యనిర్వాహణాధికారిణి ఆర్‌వి.చందన తెలిపారు.

'పిల్లలను బడిలో చేర్పించాలి'

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

విద్యార్థుల హాజరు సంఖ్యను పెంచటంతో పాటు బడి బయట పిల్లలను బడిలో చేర్పించే విధంగా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని మండల అభివృద్ధి అధికారిణి బి.భార్గవి అన్నారు. మంగళవారం ఆమె కొండ కాలనీ ప్రాంతంలోని మోడల్ ప్రైమరీ స్కూల్‌ను, అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రంలో మునగ చెట్లు, తోటకూర మొక్కలు నాటాలని సూచించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని ఆదేశించారు. అనంతరం పాఠశాల హాజరు పట్టీలు, రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు కె.సర్వేశ్వరరావు, కె.ఆనంద్ కుమార్, ప్రధానోపాధ్యాయులు వై.శ్యామ్‌సుందర్, సిబ్బంది పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **DOLLA SANTHA RAJU** S/o Dolla Muniyya, D.No. 13-46/1, Nakkavaripalem, Mogaltur, Mogaltur Mandal, W.G.Dt, A.P.- I have changed my name from **DOLLA SANTI RAJU** (Old name) to **DOLLA SANTHA RAJU** (New name) hence forth I am being called **DOLLA SANTHA RAJU** S/o Dolla Muniyya, for all purposes.